teluguislam.net



# 8. ముహర్రం మాస ఆదేశాలు

ప్రియసోదరులారా!

అల్లాహ్ అనుగ్రహాలకు కృతజ్ఞతలు తెలుపండి. అల్లాహ్ ఆదేశం :

إِنَّ عِدَّةَ الشُّهُورِ عِندَ اللَّهِ اثْنَا عَشَرَ شَهْرًا فِي كِتَابِ اللَّهِ يَوْمَ خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ مِنْهَا أَرْبَعَةٌ حُرُمٌ ۚ ذَٰلِكَ الدِّينُ الْقَيِّمُ ۚ فَلَا تَظْلِمُوا فِيهِنَّ أَنفُسَكُمْ

"నిశ్చయంగా నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర-అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. ఆయన ఆకాశాలను, భూమిని సృష్టించిన రోజునుంచీ (ఈ లెక్క ఇలాగే సాగుతున్నది). వాటిలో నాలుగు మాసాలు నిషిద్ధమైనవి (గౌరవ ప్రదమైనవి.) ఇదే సరైన ధర్మం. కాబట్టి ఈ మాసాలలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి. ముష్రిక్కులు మీ అందరితో పోరాడు తున్నట్లే మీరు కూడా వారందరితో పోరాడండి. అల్లాహ్ భయభక్తులుగల వారికి తోడుగా ఉంటా దన్న సంగతిని తెలుసుకోండి."

***(తౌబా 9 : 36)***

ముస్లిం సహోదరులారా!

మనం దైవానుగ్రహాలకు కృతజ్ఞతలు చెల్లించాలి. అల్లాహ్ తన గ్రంథంలో ఏమంటున్నాడంటే,

ఓ నా దాసులారా! మీరు గనక నా అనుగ్రహాలకుగాను కృతజ్ఞులై ఉంటే, నేను మీకు మరింతగా అనుగ్రహిస్తాను. ఒకవేళ మీరు గనక నా మేళ్ళను మరిచి పోతే నా శిక్ష తీవ్రంగా ఉంటుందన్న సంగతిని మరువకండి.

కాబట్టి మనం దైవానుగ్రహాల విలువను తెలుసుకోవాలి. అంటే అల్లాహ్ మేళ్ళను, వరాలను కాపాడుకోవాలి. వాటి ద్వారా అభివృద్ధి చెందాలి. ఒకవేళ అల్లాహ్ ఎవరికైనా ధర్మసమ్మతమైన ఉపాధిని ప్రసాదిస్తే, దాన్ని కాపాడుకోవాలి.

ఎవరికైనా విద్యాబుద్ధులు అబ్బితే వాటి ద్వారా లాభం పొందాలి. ఇతరులకు కూడా లాభం చేకుర్చాలి. అయితే అల్లాహ్ మనకు ప్రసాదించిన అనుగ్రహాలోకెల్లా అతి ముఖ్యమైన అతివిలువైనది 'జీవితం' అల్లాహ్ అనుగ్రహం వల్లే మనం మన జీవితంలో మరో పవిత్ర ముహర్రం మాసంను పొందాము. ముహర్రం అంటే నిషిద్ధమైన, పవిత్రమైన, గౌరప్రదమైన నెల. అల్లాహ్ నాలుగు నెలలను పవిత్ర మాసాలుగా నిర్ణయించాడు. అవి చాలా పవిత్రమైనవి. అందులో యుద్ధాలు, పోరాటాలు నిషిద్ధం. ఈ నెలల్లో చాలా గౌరవ ప్రదంగా పవిత్రంగా గడపాలి. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: **“నిశ్చయంగా, నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర పన్నెండు నెలలు మాత్రమే ఇది భూమ్యాకాశాలు సృష్టించిన దినం నుండి అల్లాహ్ గ్రంథంలో వ్రాయబడి ఉంది. వాటిలో నాలుగు నిషిద్ధ మాసాలు. ఇదే సరైన ధర్మం. కావున వాటిలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి. బహుదైవారాధకులతో అందరూ కలసి పోరాడండి. ఏ విధంగానైతే వారందరూ కలిసి పోరాడుతున్నారో, నిశ్చయంగా, అల్లాహ్ దైవభీతి గలవారితోనే ఉంటాడని తెలుసుకోండి.** (తౌబా 9 : 36)

12 నెలల్లో 4 మాసాలు నిషిద్ధమైనవి. అవి రజబ్, జిల్‌ఖాయిదా, జిల్‌హిజ్జ, ముహర్రం. ఈ మాసాల్లో నే అరబ్బులు వ్యాపారాలు, వాణిజ్యాలను ముమ్మరం చేసేవారు. యుద్ధాలను, పోరాటాలను నిలిపివేసేవారు. యుద్ధాలు చేయటం హరాం. ఇస్లాం కూడా ఈ నాలుగు నెలలనే పవిత్ర నిషిద్ధ మాసాలుగా నిర్ణయించింది.

అందులోని మొదటి నెల ముహర్రం.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి. అన్హు) కథనం ప్రకారం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మదీనా వలస వచ్చినప్పుడు యూదులను ఆషూరా దినాన (ముహర్రం 10 తేదీన) ఉపవాసం పాటించటం చూశారు. కారణం అడిగితే ఇది మూసా (అలైహిస్సలాం) మరియు ఇస్రాయీల్ సంతతి వారికి వారి శత్రువు (ఫిర్‌ఔన్) నుండి అల్లాహ్ విముక్తి ప్రసాదించిన రోజు అనీ, ఇందుకు గాను కృతజ్ఞతాభావంతో మూసా(అ) ఈ రోజున ఉపవాసం పాటించారని యూదులు తెలిపారు. అది విన్న దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: మూసా(అ) తో నాకున్న సంబంధం మీకన్నా పటిష్టమైనది. కాబట్టి ఆషూరా రోజు ఆయన(అ) స్వయంగా ఉపవాసం ఉండటమేగాక , తన సహచరులను కూడా ఉపవాసం పాటించాల్సిందిగా తాకీదు చేశారు. (ముస్లిం)

teluguislam.net



రమజాన్ ఉపవాసాల తరువాత అత్యంత శ్రేష్ఠమైన ఉపవాసం ముహర్రం నెల ఉపవాసమే అని మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చారు.
(ముస్లిం)

ఆషూరా ఉపవాసం గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను ప్రశ్నించగా అది గడిచిన ఒక సంవత్సరపు పాపాలను తుడిచేస్తుందని వివరించారు.
(ముస్లిం)

**ఇస్లాం సోదరులారా!**

పవిత్ర ముహర్రం నెల ఇస్లామీయ సంవత్సరంలోని అత్యంత శ్రేష్ఠత గల నెల. హిజ్రీ సంవత్సరం ఈ నెలతోనే ప్రారంభమవుతుంది.

ఈ పవిత్ర మాసంలోని పదవ తేదీన దైవ ప్రవక్త (స) ప్రియ మనవడు హుసైన్ (రజి)అమరగతి పొందిన సంఘటన చరిత్రలో అత్యంత విషాదకర సంఘటన. "**ఇన్నాలిల్లాహి వఇన్నా ఇలైహి రాజివూన్.**

హుసైన్ (రజి) అమరగతి సంఘటన అనేక విధాలుగా ప్రచారంలో ఉంది. హజ్రత్ హుస్సేన్ (రజి) విశిష్ఠతను, ఘనతలను పట్టించుకోని ఆయన విరోదులు ఆయన్ని అతీదారణంగా హతమార్చారు.

అల్లాహ్ మనందరి తరపునుండి అమరుడు హుసైన్‌పై శాంతి కరుణలు కురుపించుగాక. అల్లాహ్ విధివ్రాత ప్రకారం హుస్సేన్ (రజి) అమరగతి నొందారు. అలాంటి అమరవీరుల గురించి అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఇలా ప్రబోధించాడు:

وَلَا تَقُولُوا لِمَنْ يُقْتَلُ فِي سَبِيلِ اللَّهِ أَمْوَاتٌ ۚ بَلْ أَحْيَاءٌ وَلَٰكِن لَّا تَشْعُرُونَ ۝

**"అల్లాహ్ మార్గంలో చంపబడిన వారిని మృతులని అనకండి. నిజానికి వారు సజీవులుగా ఉన్నారు, కాని మీరు గ్రహించలేరు."**

***(అల్ బఖర 2 : 154)***